

# అవమానం

నేను అన్నాను:

"పిల్లలతో చెలిమి నిజంగా మధురం. పిల్లల వచ్చీ రాని మాటలతో ఎంతో ఆనందం అనుభవించవచ్చు. అర్థం చేసుకునే శక్తి, ఓరిమి ఉంటే ఎంత అయినా ఆనందించవచ్చు" అని.

మా నరసింహం వూరుకోలేక పోయాడు. ముఖ్యంగా పిల్లల సంగతి చర్చకు వస్తే అసలు వూరుకోలేడు. నిజానికి నరసింహానికి మాట్లాడడమంటే సరదా. అతని మాటలు వినడం అంటే మా స్నేహితులకు సరదా.

నరసింహం అన్నాడు:

"నువ్వు అన్నమాట సరిఅయినది కాదురా. ఏమంటావా? పిల్లలు అమాయకులు అయిన మాట నిజమే. వచ్చీ రాని మాటలు బాగా ఉంటాయి అన్నదీ వాస్తవమే. కాని, చిత్రంగా పిల్లలు సత్యం తెలుసుకోగలరు. వారి భాషలో వారికి చేతనైన విధంగా ఆ సత్యాన్ని చెప్పేస్తారు. చెప్ప కూడదు అన్న ఆంక్షకు వారికి అర్థం తెలియదు. నిజం కటువుగా వుండడం మాట అటు ఉంచు. కాదనను. కాని, వారి మాటలు ఒక్కొక్కప్పుడు హృదయానికి సూటిగా గుచ్చుకుంటాయి. బాధిస్తాయి. అవమానం కూడా కలిగిస్తాయి."

ఈపర్యాయం నేను ఉండబట్టలేకపోయాను. నరసింహం ఉపన్యాసం ప్రారంభించాడు. ముగిసేవరకు మరి ఎవరూ మాట్లాడడానికి అవకాశం ఉండదు. మొదట్లోనే అడ్డు తగల డానికి సిద్ధపడ్డాను. ఏమంటే, ఆ రోజున ఒక చిన్న సంఘటన జరిగింది. అది చెబుదామనే స్నేహితులు నలుగురం కూర్చుని ఉండగా పిల్లల సంగతి ప్రస్తావించాను. దురదృష్టవశాత్తు పిల్లలు అందరి గురించి రెండు మాటలు చెప్పాను. మా నర సింహం దొరక పుచ్చుకున్నాడు.

తెగించి నరసింహానికి అడ్డు వచ్చాను. లేకపోతే ఆ సంగతి నలుగురికీ చెప్పుకోనేందుకు మరి ఎప్పుడూ అవకాశం లభించదు.

ఈ చర్చ నాకూ, నరసింహానికీ విడిచిపెట్టి మిత్రులు తటస్థంగా ఉండిపోయారు.

చెప్పాను : "ముందు ఇది వినవోయ్. తరువాత మాట్లాడుదువుగానీ. మూర్తి అని వెనక నాతో హైదరాబాదులో పనిచేసిన మిత్రుడు చాలా సంవత్సరాలకు ఈవేళ మా ఇంటికి వచ్చాడు. పిచ్చాపాటీ చెప్పుకున్నాం. భోజనానికి కూర్చునే ముందు 'పిల్లలు ఎందరు, ఈమధ్య ఏమైనా కలిగారా' అని మూర్తి అడిగాడు. మా ఆవిడ చంటిదాన్ని తీసుకొనివచ్చి చూపింది. పేరేమిటి అన్నాడు మూర్తి. చెప్పాను. నాలుగు నెలలు అనికూడా చెప్పాను.

" 'పాపాయి అందంగా వుంది' అన్నాడు మూర్తి.

"మా పెద్దవాడు—పట్టాభి అక్కడే వున్నాడు. 'బాగా ఉంటే మీరు తీసుకువెళ్ళి పెంచుకోండి.' అనేశాడు. ఆ అయిదేళ్ళ కుంక అన్న మాటకు మూర్తే కాదు, నేనుకూడా నవ్వేశాను.

"ఏమంటావా—నాకు ముగ్గురు పిల్లలు అయితే, మూర్తికి మూడు మూళ్లు తొమ్మిదిమంది. మూర్తికి బాగా చిన్నతనంలోనే పెళ్ళయి, భార్య కాపురానికి వచ్చింది.

" 'బాగా వున్నా నేను పెంచుకోలేనురా, నాయనా! మీ నాన్నే సమర్థుడు' అన్నాడు మూర్తి."

"నేను చెప్పింది నువ్వు సరిగా అర్థం చేసుకోలేకపోయావురా" అన్నాడు నరసింహం.

"నువ్వు పెద్ద మాటలు వాడావు. వాటికి అర్థం కూడా నువ్వే చెప్పాలి." అన్నాను.

"అయితే విను" అని నరసింహం ఇలా చెప్పాడు :

"ఇది చాలా చిన్న సంగతి. అని నేను చెప్పనక్కర లేదనుకుంటాను. విన్న తరువాత నువ్వే తెలుసుకోవచ్చు.

"అప్పుడు బెజవాడలో టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ మానేజరుగా ఉన్నాను. జీతం ఇరవై రూపాయలు. పెద్దవాడికి అప్పటికి ఆరేళ్ళు. యజమాని ఇష్టం వచ్చినప్పుడల్లా జీతం ఇచ్చేవాడు. అంటే మూడు నెలలకు ఎప్పుడో ఒకసారి నా ఉనికి గుర్తుకు వచ్చి జీతం రాళ్ళు పారవేసేవాడు. అసలే జీతం తక్కువ. దానికి తోడు ఇది ఒకటి.

"ఒక్కొక్కప్పుడు పిల్లలకు మాత్రం ఇంత పెట్టి నేను, మా ఆవిడ కడుపులో కాళ్ళు పెట్టుకొనేవాళ్ళం. పిల్లలకు కూడా పెట్టడానికి ఎంతో అవమానానికి తల ఒగ్గితే కాని గతి ఉండేది కాదు. ఇదీ పరిస్థితి.

"దీపావళి వచ్చింది. తెలుగునాట దీపావళి ఎలా జరుగుతుందో మీకు తెలియనిది కాదు. పండుగ ఇంకో పక్షం ఉండనగానే బాణసంచా తయారు అయిపోతుంది. కాల్చడం ప్రారంభం. ఎక్కడ చూచినా దీపావళి హడావిడి.

"ఆసారి పండుగరోజుకు అటు ఇటు వారం రోజులు తిండికూడా లేకుండా గడిపాము.

"ఇంట్లో పిల్లవాడు చుట్టూ అందరూ కాల్చుతూ ఉంటే చూస్తూ ఉండేవాడు. నేను వాడిని చూస్తూ వుండేవాడిని. అంతకన్నా మరి ఏమీ చేయలేకపోయాను.

"ఆవేళ దీపావళి. నాదగ్గర ఈడ్చి తన్నితే ఏగాని లేదని పక్క వాటాలో వున్న వెంకటరావుగారికి తెలుసు. పుణ్యాత్ముడు. ప్రాణాపాయం వచ్చినప్పుడు అల్లా రూపాయీ,

అర్థా ఇచ్చేవాడు. ఆపద గడిపేవాడు. ఆయనకు చాలా నే ఋణపడ్డాను. డబ్బు అంటే తీర్చాను. అదయినా ఆ తరువాత నాలుగేళ్ళకు. ఆయనకు నా జీవితమే ఋణపడి వుంది.

"ఆ వేళ ఆయన వచ్చాడు. 'నరసింహంగారూ, ఒకట మాట'' అన్నాడు.

" 'చెప్పండి' అన్నాను.

" 'మీరు ఏమీ అనుకోకుండా ఉంటే—' అని నసిగాడు.

" 'చెప్పండి' అన్నాను.

" 'నా దగ్గర డబ్బు వుంది' అన్నాడు.

"నేను మాట్లాడలేదు. అంతవరకు నేను అడిగితే కాని ఆయన ఎప్పుడూ డబ్బు చూపలేదు. ఈరోజు ఇదేమా అనుకొన్నాను.

" 'దీపావళి వచ్చింది' అన్నాడు.

" 'నాకూ తెలుసు.' తిండికి గతిలేకపోయినా ప్రాణాపాయంరాలేదు. అందుచేత ఆ పుణ్యాత్ముని డబ్బు అడగలేదు.

" 'బాబుకు నాలుగు టపాకాయలు పట్టుకువస్తాను' అని ఆయన మెల్లగా చెప్పాడు.

"తిండికి తిప్పలకు, మందులకు ఋణం పుచ్చుకోవడం నాకు ఆక్షేపణ లేదు. గత్యంతరం లేదు. కాని, పండుగలకు పబ్బాలకు, సినిమాలకు విలాసాలకు ససేమిరా తీసుకోను. అది వెంకటరావుగారికి బాగా తెలుసు.

" 'ఇది ఋణంకాదు. నా సరదా. పిల్లలు వూళ్ళో లేరు.

బాబు అయినా కాల్చుతూ ఉంటే చూచి సంతోషిస్తాను' అన్నాడు ఆయన.

"వెంకటరావుగారు పెద్దవాడు. భార్య, పిల్లలు ఫూళ్ళో లేనిమాట వాస్తవం. ఆయన మాటలకు నా కళ్ళు నీళ్ళతో నిండినవి.

" 'బాబుగారూ! మన్నించండి. డబ్బు ఉంటే నేనే కొంటాను. లేకపోతే లేదు. మీ అంతఃకరణ అలాంటిది. అది చాలు. కొనకండి. నన్ను కష్టపెట్టవద్దు' అన్నాను.

"ఆయన అర్థం చేసుకోగలడు. చేసుకున్నాడు. వెళ్ళి పోయాడు.

"అబ్బాయి నా ప్రక్కనే ఉన్నాడు. అంతా విన్నాడు. దీపావళి వెళ్ళిపోయింది. వాడుమాత్రం నోరు విప్పి టపాసులు కొనమని నన్ను అడగలేదు. టపాకాయలకోసం బెంగపడ లేదు. దీపావళి గొడవ పట్టించుకోననే లేదు.

"పిల్లవాడు అయినా అవమానంనుంచిరక్షించినందుకు, నమ్మకం లేకపోయినా, భగవంతునికి వందనం చేశాను.

"తరువాత ఆయిదేళ్ళకు మద్రాసులో ఎగుమతి, దిగుమతి కంపెనీలో ఉద్యోగం చేస్తూన్నాను. జీవితం మొదటి సారి తిన్నగా పోతున్న రోజులు. చాలాకాలం క్రిందట చేసిన ఋణాలు తీర్చడం అనేది మొదటిసారిగా అనుభవంలోనికి వచ్చినది.

"అబ్బాయి మొదటి ఫారమ్ చదువుతున్నాడు. సైకిల్ కావాలన్నాడు. కొంటానన్నాను. జీతం రానిమ్యి, అలాగే కొంటాను అని చెప్పాను.

"జీతం వచ్చింది. అయిపోయింది. మళ్ళీ వచ్చింది. అయిపోయింది. నాలుగు నెలలు గడిచిపోయాయి. ప్రతి నెలా వాడు కొనమనడం, నేను కొంటాననడం తప్ప మరేమీ లేదు. ఏదో ఒక ఖర్చు. సాధ్యం కాకుండా పోయింది. కొంచెం కష్టపడితే కొనగలిగి వుండేవాడిని. కాని ఎందువల్లనో చేయలేకపోయాను.

"ఆసారి కూడా జీతం ఇంటికి పట్టుకువచ్చాను. మా ఆవిడ, నేను లెక్కలు వేస్తూన్నాం.

"అబ్బాయి వచ్చాడు. 'మీరు సైకిల్ కొనక్కర లేదులెండి' అన్నాడు.

"నేను మౌనంగా ఉండిపోయాను.

" 'కొంటాను,కొంటాను అనడమే కాని మీరుకొనరు. నాకు తెలుసు. అందుకని చెబుతున్నాను. మీరు కొనక్కర లేదు. నాకు సైకిల్ వద్దు లెండి' అన్నాడు.

"నేను ఇంకా సమాధానం చెప్పే స్థితిలోకి రాలేదు. అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

"ఆ తరువాత కొంతకాలానికి సైకిల్ కొనిపెట్టాను. అబ్బాయి ప్రత్యేకంగా ఏమంత సంతోషం చూపలేదు. చూపకుండాను ఉండలేదు.

"కాని ఈరోజు వరకు నన్ను దేనికీ అడగడు. అదే నా అవమానం."

మేమందరం ఆలోచిస్తూ ఉండిపోయాము.

—